నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 29 మార్చి 2025 | HYDERABAD



## అమన్ స్వీట్ ఫ్యాక్టరీ సీజ్..

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు శుక్రవారం పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. అల్వాల్‌లోని కింగ్స్ 7 బేకరీ, మాదాపూర్ పాలమూరు గ్రిల్, జవహర్ నగర్ తిరుమల మెస్ అండ్ కర్రీ పాయింట్, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బావర్చీ రెస్టారెంట్, గచ్చిబౌలిలోని సిప్ అండ్ స్నాక్స్ తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేశారు. అలాగే మల్లాపూర్‌లో అమన్ స్వీట్ ఫ్యాక్టరీలో గడువు ముగిసిన స్వీట్లతో మళ్లీ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత ఫ్యాక్టరీని సీజ్ చేశారు.



సూరారం డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పలువురు పార్టీ ప్రతినిధులతో కలిసి షాపూర్ నగర్ లోని జలమండలి డీజీఎం రాజును కలిసి కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. -దుండిగల్

# ఇసుక కొనేదెట్లా? ఇల్లు కట్టేదెట్లా?

## టన్ను రూ.1600 నుంచి 2000 పైనే..

### హైదరాబాద్‌లో ఇసుక కష్టాలు

### కాంగ్రెస్ పాలనలో ఖరీదైన వైనం

### ఇసుక బజార్‌లో కంటే ప్రైవేట్‌గానే తక్కువ

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో ఇసుక కొనేదెట్లా.. ఇల్లు కట్టేదెట్లా? అనే పరిస్థితి నెలకొన్నది. భాగ్యనగరంలో సామాన్యుడి సొంతింటి కలకు ఇసుక ధరలు అడ్డుపడుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ప్రైవేటు ఇసుక ఏజెన్సీలను తొలగించడంతో ప్రభుత్వ ఇసుక బజార్లలో కొనాలంటే కొనలేని పరిస్థితి. టన్ను ఇసుక దొడ్డు రకం రూ.1600, సన్నరకం రూ.1800కు విక్రయిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటుచేసిన ఇసుక కొనుగోలు కేంద్రాలకు 'ఇసుక బజార్' అని పేరు మార్చారు. ఈ కొనుగోలు కేంద్రాలు హైదరాబాద్ శివారు ప్రాంతాలైన వట్టినాగులపల్లి, భౌరంపేట, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉన్నాయి. ఇక్కడి నుంచి ఇసుక కొనుగోలు చేయాలంటే రవాణా ఖర్చు తడిచి మోపెడవుతున్నది. అసలు ధర కంటే రవాణాకే జేబు ఖాళీ అవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిటీలోని కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటుగా ఇసుక విక్రయించుకునేందుకు అనుమతులు ఉండటంతో ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు అవి లేకపోవడంతో టన్ను ధర రూ.1600కు కొనుగోలు చేస్తే, రవాణా, బుకింగ్, ఇతర ఖర్చులతో కలిపి రూ.2000 పైనే అవుతున్నది. దీంతో సామాన్యుడు ఇల్లు కట్టడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### ఇసుక బజార్ల కంటే బయటే తక్కువ..

ఇసుక బజార్ నుంచి కొనుగోలు చేయాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. కొనుగోలుదారుడే వాహనం తీసుకెళ్లాలి. ఒక్కో ట్రిప్పునకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నారు. ఈ లెక్కన పది టన్నుల ఇసుక కొనుగోలుకు ప్రభుత్వ ధర కంటే అదనంగా మరో రూ.2 నుంచి 5 వేల వరకు అవుతున్నది. ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తే టన్ను ఇసుకపై రూ.100 నుంచి రూ.200 వరకు తీసుకుని ఎలాంటి రవాణా చార్జీలు తీసుకోకుండా ఇంటికొచ్చి అన్‌లోడ్ చేసి వెళ్తున్నారు. బుకింగ్, రవాణా కోసం తిరగాల్సిన పని ఉండదు. ఎలాంటి ఇబ్బందులు, వ్యయప్రయాసలు లేకుండా ఇసుక ఇంటికే వస్తున్నప్పుడు ప్రభుత్వ విక్రయ కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదని పేర్కొంటున్నారు.

#### ఇసుక బజార్లు వెలవెల..

నగరంలోని ప్రైవేట్ ఇసుక కేంద్రాలను ప్రభుత్వం తొలగించినా ఇల్లు కట్టుకునేవారు ఇసుక బజార్ల వైపు వెళ్లడం లేదు. దీంతో అవి వెలవెలబోతున్నాయి.



వెలవెలబోతున్న వట్టినాగులపల్లి సాండ్ బజార్

ప్రైవేట్ వ్యక్తులు ఇసుక రీచ్‌ల నుంచి నేరుగా ఇంటికే సరఫరా చేస్తుండటంతో వారినే ఆశ్రయిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, ఇసుక కూడా సులువుగా దొరకని పరిస్థితి నెలకొన్నదని బాధితులు వాపోతున్నారు.

#### ఇంటికే వస్తుంటే ఇసుక బజార్లెందుకు?

కోకాపేటలో నాలుగు ఫ్లోర్ల ఇల్లు కడుతున్నా. 25 టన్నుల ఇసుక అవసరం ఉన్నది. తెలిసిన వ్యక్తి ద్వారా ప్రైవేట్ వారిని ఆశ్రయించా. రవాణా చార్జీతో కలిపి టన్నుకు రూ.1900 పడుతుంది. ఇంటి ముందుకు వచ్చి అన్‌లోడ్ చేసి వెళ్తున్నారు. ఇసుక బజార్‌లో తీసుకుందామంటే టన్ను రూ.1600 చెప్పిండ్రు. బుక్ చేసుకోవాలంటే నార్సింగి వెళ్లాలి. అక్కడ రశీదు తీసుకుని వట్టినాగులపల్లి ఇసుక బజార్‌కు వెళ్లాలి. వారికి రశీదు ఇచ్చి టిప్పర్‌ను కిరాయికి తీసుకెళ్లాలి. టిప్పర్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేలు అడుగుతున్నరు. ఇంత శ్రమ అక్కర్లేకుండానే ఒక్క ఫోన్‌తో ఇసుక ఇంటికే వస్తుంది. దీంతో ప్రైవేటుగానే కొనుగోలు చేస్తున్నా.

**- అరికె కృష్ణ, కోకాపేట**

*ఫిల్మ్‌నగర్‌లో ఓ వ్యక్తి జీప్లస్ వన్ ఇల్లు కట్టుకుంటున్నాడు. వట్టినాగులపల్లి ఇసుక బజార్ నుంచి ఇసుక తెచ్చుకోవడానికి రవాణా చార్జీలు, బుకింగ్ కోసం తిరగడానికి కలిపి టన్నుకు రూ.2200 అవుతుంది. తెలిసిన వ్యక్తి ద్వారా అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ వ్యక్తిని సంప్రదించాడు. అత్తాపూర్ నుంచి ఎలాంటి బుకింగ్, రవాణా చార్జీ లేకుండానే రూ.2వేలకు టన్ను చొప్పున సరఫరా చేస్తున్నాడు. వ్యయప్రయాసలు లేకుండా ఇంటికే ఇసుక వస్తుండటంతో ప్రైవేటు నుంచే తెచ్చుకునేందుకు మొగ్గు చూపుతున్నాడు.*

# సంక్షేమ పథకాలు అందేదెలా?

### రేషన్‌కార్డు ప్రామాణికంతో అర్హులకు ఇబ్బందులు



మేడ్చల్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుల కోసం లక్ష 22 వేల దరఖాస్తులు వస్తే నామమాత్రంగా 6,700 వందల రేషన్ కార్డులు మాత్రమే జారీ చేశారు.ఈ క్రమంలో మిగతా దరఖాస్తుదారుల్లో వివిధ సంక్షేమ పథకాలకు అర్హులుగా ఉన్నా..రేషన్ కార్డులు అందక తమకు సంక్షేమ పథకాలు ఎలా దక్కుతాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించి సుమారు 13 నెలలు పూర్తయిన దరఖాస్తుదారులకు రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.కాగా, సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవద్దని నిరుపేదలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దరఖాస్తుదారులకు విచారణ పేరిట రేషన్ కార్డులు అందించడంలో ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రేషన్‌కార్డుల ద్వారా అందే ఆరోగ్య సేవలు, గృహజ్యోతి, రాయితీ వంట గ్యాస్, రాజీవ్ యువ వికాస్ పథకం, ఇతర పథకాలకు రేషన్ కార్డులే ప్రామాణికం. దీంతో ఈ పథకాలకు అర్హులుగా ఉండి రేషన్ కార్డులు లేకుంటే ఈ పథకాలకు కనీసం దరఖాస్తులు చేసుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

## రియల్ వ్యాపారులు బెంబేలు

### 'అట్టడుగుకు రియల్టీ' కథనంపై విస్తృత చర్చ

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రియల్ రంగం కుదేలైందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ వెల్లడించిన విస్మయకర వాస్తవాలను 'నమస్తే' శుక్రవారం 'అట్టడుగుకు రియల్టీ' శీర్షికన ప్రచురించిన కథనంపై తెలంగాణలో విస్తృత చర్చకు దారితీసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంబంధీకులు ఈ కథనంపై జోరుగా చర్చిస్తున్నారు. వారి రియల్ ఎస్టేట్ సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేశారు. నగరంలో ఏకంగా 49 శాతం మేర ఇండ్ల అమ్మకాలు పడిపోయాయని, దేశంలో అన్ని మెట్రో నగరాల్లో కంటే హైదరాబాదే అట్టడుగులో ఉందని తేల్చడంతో వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. మరోవైపు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ 'కొలియర్స్ ఇండియా' విడుదల చేసిన నివేదికలో టాప్ 7నగరాల్లో స్థూలంగా 159 లక్షల చదరపు అడుగు మేర(ఎస్ఎఫ్టీ) ఆఫీస్ లీజింగ్ లావాదేవీలు జరిగాయని తేల్చింది. కానీ హైదరాబాద్‌లో మాత్రం 17 లక్షల చదరపు అడుగుల లీజింగ్ లావాదేవీలు మాత్రమే జరిగాయి. గతేడాది మొదటి మూడు నెలల్లో లీజింగ్ 29 లక్షలతో పోల్చి చూస్తే ఇప్పుడు 41 శాతం తగ్గినట్టు నివేదిక పేర్కొంది.




# సిటీలో కోల్డ్ ఎలర్జీ

### కలుషిత ఆహార పానీయాలతో విజృంభిస్తున్న బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌లు

సిటీబ్యూరో: సిటీలో ఎక్కడ చూసినా దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి వంటి లక్షణాలతో రోగులు దవాఖానల బాట పడుతున్నారు. వేసవిలో వైరస్‌ల ప్రభావం పెద్దగా ఉండదు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సీజన్‌లో కొన్ని రకాల విషజ్వరాలు నమోదవుతున్నాయి. ఉస్మానియా, గాంధీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, జిల్లా హాస్పిటల్స్‌లో జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి కేసులు పెరుగుతున్నట్లు గ్రేటర్ వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది.

#### ఓపీ పెరగకున్నా

ఫీవర్ దవాఖానలో రోజువారీ ఓపీలో 40 శాతం దగ్గు, గొంతునొప్పి లక్షణాలతో కూడుకున్న కేసులు అధికంగా ఉన్నాయి. ఉస్మానియాలో వస్తున్న కేసుల్లో 30 శాతం, గాంధీ దవాఖానలో 32 శాతం, బస్తీ దవాఖానలు, ఇతర ప్రభుత్వ దవాఖానల్లో 33 శాతం కోల్డ్ అలర్జీ కేసులు పెరిగాయి. కాగా, ఈ సందర్భంలోనే కలరా, డయేరియా రోగాలు కూడా నమోదుకావడం గమనార్హం. ఫీవర్ దవాఖానలో 1 కలరా, 58 డయేరియా, ఉస్మానియాలో 3 కలరా, 60 డయేరియా, గాంధీ దవాఖానలో 1 కలరా, 48 డయేరియా, నిలోఫర్‌లో 33 డయేరియా కేసులు నమోదయ్యాయి. జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఒంటినొప్పులు, నీరసం, విరేచనాలు ఈ కోల్డ్ ఎలర్జీ లక్షణాలుగా ఉంటాయని వైద్యులు తెలిపారు.

#### అలర్జీనే ప్రధాన కారణం

ప్రస్తుతం విజృంభిస్తున్న జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి వంటి లక్షణాలకు కోల్డ్ అలర్జీనే ప్రధాన కారణమని ప్రముఖ జనరల్ ఫిజీషియన్, యాదాద్రి-భువనగిరి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డా.రాజారావు చెప్పారు. చాలా మంది ఫ్రిడ్జ్‌లో పెట్టిన చల్లటి వస్తువులను మర్నాడు లేదా కొన్ని గంటల తరువాత వేడి చేసి తీసుకోవడం వల్ల కూడా ఈ కోల్డ్ అలర్జీ ప్రభావం చూపే అవకాశాలున్నట్లు తెలిపారు. ఇళ్లలో ఉదయం వండిన అన్నం లేదా ఇతర ఆహార పదార్థాలు మధ్యాహ్నం లేదా సాయంత్రానికే పాడవుతాయి. దానికి కారణం అందులోని బ్యాక్టీరియా అనేది అధిక ఉష్ణోగ్రతల వల్ల వృద్ధి చెందుతుంది. నిలువ చేసిన ఆహార పదార్థాలు లేదా కలుషిత ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఎక్కువగా టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-ఏ, హెపటైటిస్-ఈ (కామెర్లు) తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వేసవిలో కలుషిత ఆహార పదార్థాలు, కలుషిత నీటి వల్ల కలరా ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు.

#### ప్రయాణాలు, కోల్డ్ అలర్జీ వల్లే..



పిల్లలకు సెలవులు ఉండడంతో విహారయాత్రలు ఎక్కువగా చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఇటీవల చాలా మంది మహా కుంభమేళా, అయోధ్య, వారణాసి తదితర యాత్రలకు వెళ్లి వచ్చారు. ఈ విధంగా ఎక్కువ సంఖ్యలో జనం ప్రయాణాలు చేయడం వల్ల ఆయా ప్రాంతాల్లో జనం ఒక్కదగ్గర గుమ్మిగూడటం వల్ల వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల్లో ఉన్న వైరస్‌లు లేదా బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్ ఒకరి ద్వారా మరొకరికి సోకే అవకాశాలుంటాయి. వివిధ తీర్థయాత్రలకు వెళ్లి వచ్చినప్పటి నుంచి చాలా మంది జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి వంటి లక్షణాలతో దవాఖానలకు వస్తున్నారు. దీనికి తోడు చాలా మంది కోల్డ్ అలర్జీకి గురవుతున్నారు.

**-డా.రాజారావు, సూపరింటెండెంట్(యాదాద్రి-భువనగిరి ప్రభుత్వ దవాఖాన)**

### పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలతోనే

## రామోజీ భూ అక్రమాలు

### సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నం: రామోజీ యాజమాన్యం ఆధీనంలో ఉన్న పేదల ఇండ్ల స్థలాలను విడిపించి పేదలకు పంపిణీ చేయకపోతే మరో పోరాటానికి సిద్ధమవుతామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నాగన్‌పల్లి గ్రామంలో 2007లో అప్పటి ప్రభుత్వం ఇంటిస్థలాల సర్టిఫికెట్లు ఇచ్చిన పేదలందరూ కలిసి తమ స్థలాల్లోకి వెళితే పోలీసులు అక్రమ అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికీ 60గజాల చొప్పున ఇంటిస్థలం పట్టాలు ఇచ్చిన నక్ష ప్రకారం పొజిషన్ కూడా చూపించాలన్నారు. ఈ ఇండ్ల స్థలాలను రామోజీ యాజమాన్యం ఆక్రమించి లబ్ధిదారులను ఆ స్థలాల్లోకి రాకుండా ఇబ్బందులు పెడుతున్నదన్నారు. ఇంటి స్థలాలకు వెళ్లే దారిలో కందకాలు తీశారన్నారు. ప్రభుత్వ నక్ష రోడ్డును కూడా రామోజీ యాజమాన్యం ప్రజలను రానివ్వకుండా అడ్డుగోడ నిర్మించుకుందన్నారు. లబ్ధిదారులు తమ ఇండ్ల స్థలాల్లోకి వెళ్తున్న క్రమంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కుమ్మక్కై పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. మహిళలని కూడా చూడకుండా పోలీసులు విచక్షణ రహితంగా ప్రవర్తించారని, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్‌కు గాయాలయ్యాయని తెలిపారు. రామోజీ ఆధీనంలో ఉన్న మరో 370 ఎకరాలను పదివేల మందిని సమీకరించి ఆక్రమిస్తామని హెచ్చరించారు. 18 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న పేదలపై కేసులు నమోదు చేయడమే తప్ప.. సమస్యను పరిష్కరించటం లేదని విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మా రైతులకు తిరిగి భూములను ఇస్తామని చెప్పి మోసం చేసిందని, మళ్లీ ఫ్యూచర్ సిటీ పేరుతో 2500ఎకరాల భూములను పేదల నుంచి సేకరించేందుకు పూనుకుందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర ముగింపు సందర్భంగా పోలీసులు అనుమతి ఇచ్చి చివరకు నిరాకరించాన్నారు. రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమించిన పేదల ఇంటిస్థలాలు తిరిగి అప్పగించే వరకు ఉద్యమిస్తామన్నారు.

# వాహనాలకూ రియల్ బ్రేకులు..!

### గ్రేటర్‌లో తగ్గిన కార్ల కొనుగోళ్లు

### 2023లో 1,18,322 కార్ల విక్రయం

### 2024లో 12 శాతం తగ్గిన అమ్మకాలు



సిటీబ్యూరో: గ్రేటర్‌లో వాహనాల కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. కార్ల షోరూంలు, ఇతర వాహనాల షోరూంలు సందడి లేక కళతప్పాయి. రాష్ట్రంలోనే అత్యధిక వాహనాలు ఉన్న గ్రేటర్ హైదరాబాద్ ఏడాదిన్నరగా వాహనాల కొనుగోళ్లలో దూకుడు తగ్గింది. 2023లో హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డిలో 1,18,322 కార్లు విక్రయించగా.. 2024లో ఆ కార్ల అమ్మకాలు 12 శాతం తగ్గాయని రవాణా శాఖాధికారులు, వాహన షోరూం నిర్వాహకులు తెలిపారు. కేసీఆర్ పాలనలో వాహనాల రిజిస్ట్రేషన్లలోనూ గ్రేటర్ హైదరాబాద్ పురోగతి చూపించింది. 2022లో 1,14,432 కార్లు విక్రయించగా.. 2023లో 1,18,322 అమ్ముడుపోయాయి. 2024లో మాత్రం ఆ సంఖ్య తగ్గుముఖం పట్టింది. 12 శాతం రిజిస్ట్రేషన్లు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో రవాణా శాఖకు ప్రతి ఏడాది వచ్చే ఆదాయం తగ్గే అవకాశముందని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇచ్చిన టార్గెట్‌కు అదనంగా డబ్బులు సమకూర్చిన రవాణా శాఖ.. ఈసారి ఆర్థిక సంవత్సర ముగింపు సమీపిస్తున్నా టార్గెట్ చేరుకోలేదని అధికారులు చెబుతున్నారు.

#### ఖర్చుకు వెనకాడుతున్నారు..!

నగరంలో రియల్ ఎస్టేట్ తగ్గుముఖం పట్టడం.. వ్యాపారాలు సజావుగా సాగకపోవడం, హైడ్రా దుందుడుకు చర్యలతో నగర శివార్లలో నిర్మాణ రంగం కుంటుపడటం, జాతీయ, అంతర్జాతీయంగా హైదరాబాద్ ఐటీ కంపెనీలు తరలిపోవడం వంటి కారణాలతో గ్రేటర్‌లో ఒక అనిశ్చితి వాతావరణం ఏర్పడింది. కేసీఆర్ పాలనలో భూములకు ధరలు ఉండటం, కంపెనీల ఏర్పాటు, స్టార్టప్ ఐడియాలకు ప్రోత్సాహం, వీ హబ్ వంటి వినూత్న కార్యక్రమాలతో మహిళలను సైతం వ్యాపారధిపతులుగా తయారు చేయడం లాంటివి జరిగాయి. దీంతో వాళ్లందరూ అనేక కంపెనీలు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ క్రమంలో వాళ్లంతా ఆర్థికంగా బలపడ్డారు. ఈ మార్పు కార్ల షోరూంలకు కలిసొచ్చేది. కార్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించేవారు. కానీ ఆ సందడి వాహన షోరూంలో ఇప్పుడు కరువైంది.





జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని జీహెచ్ఎంసీ పార్కులోని కుంటలో నిండిపోయిన మురుగునీరు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో వేస్తున్న పైప్‌లైన్లు

# బల్దియా కాదు పొమ్మంది..

## స్వచ్ఛంద సంస్థ చేయూతనిచ్చింది

### జూబ్లీహిల్స్ రోడ్ నం. 5 పార్కులో తీరనున్న మురుగు సమస్య

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

బంజారాహిల్స్: ఖజానాలో డబ్బులు లేవు.. జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజూ చేతులెత్తేస్తున్నారు. బల్దియాలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదంటూ కాంట్రాక్టర్లు కొత్త పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఇక ప్రభుత్వం కోసం ఎదురుచూసీ లాభం లేదనుకుంటున్న ప్రజలు స్వచ్ఛంద సంస్థల సాయం కోరుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు.రెండేండ్లుగా జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని జీహెచ్ఎంసీ పార్కులోని కుంటలో మురుగు నీరు కలుస్తోందని, మురుగునీరు పార్కులోకి రాకుండా లైన్ వేయాలని అనేకసార్లు బల్దియా అధికారులకు మొరపెట్టినా.. లాభం లేకపోవడంతో సాయం అందించాలని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్‌ను కోరారు. మురుగు సమస్యలను పరిశీలించిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్.. రోడ్ నెం 5లోని పార్కులోకి మురుగునీరు చేరకుండా పైప్‌లైన్ వేయడంతో పాటు కుంటను అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. రూ.70లక్షల అంచనా వ్యయంతో మూడురోజుల కిందట పనులు ప్రారంభించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి రోడ్ నం. 1మీదుగా పార్కులోకి చేరుతున్న వరదనీటితో పాటు మురుగునీటిని పార్కులోని కుంటలోకి చేరకుండా భారీ పైప్‌లైన్‌ను వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సుమారు రెండేండ్లుగా తాము ఎదుర్కొంటున్న మురుగు సమస్యలు తీరుతాయని, పార్కులో మురుగునీరు తొలగిపోయి వర్షపునీరు చేరితే దుర్గంధం తొలగిపోతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జీహెచ్ఎంసీ పార్కులోకి మురుగునీరు చేరకుండా బాక్స్ డ్రెయిన్ నిర్మించాలని సుమారు ఏడాదిన్నర కాలంగా తాము ప్రయత్నాలు చేస్తున్నామని, గతంలోనే సుమారు రూ.40లక్షల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ కోసం టెండర్లు జారీ చేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. సీఎస్ఆర్ కింద రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంస్థ ఈ పనులను చేపట్టేందుకు ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. మురుగు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఊరట కలిగిస్తోందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.